# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 07-08-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **బంగ్లాదేశ్‌లో శాంతి భద్రతలు మెరుగుపడే వరకు భారత్ నిశిత దృష్టితో వ్యవహరిస్తుందని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ఎస్.జయశంకర్ స్పష్టం చేశారు.**

**2.** **పోలవరం ప్రాజెక్టు పనులను అత్యంత ప్రాధాన్యతగా చేపట్టి పూర్తిచేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు వెల్లడించారు.**

3. **ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాదర్బార్ ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని హోం మంత్రి వి.అనిత తెలిపారు.**

**4.** **తెలంగాణలో ఆగస్టు 15న 2 లక్షల వరకు రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని రాష్ట్ర వ్యవసాయ శాఖమంత్రి తుమ్మల నాగేశ్వరరావు పేర్కొన్నారు.**

**5.** **ఈరోజు జాతీయ చేనేత దినోత్సవాన్ని జరుపుకుంటున్నాం.**

=========================

బంగ్లాదేశ్‌లోని అస్థిర పరిస్థితుల దృష్ట్యా భారత్ ఆ దేశంలో నివసిస్తున్న భారతీయులతో దౌత్యపరమైన మార్గాల ద్వారా సంప్రదింపులు జరుపుతోందని విదేశీ వ్యవహారాల శాఖ మంత్రి డాక్టర్ ఎస్. జయశంకర్ తెలిపారు. నిన్న రాజ్యసభలో ఈ అంశంపై మంత్రి ఒక ప్రకటన చేశారు. బంగ్లాదేశ్‌లో మైనారిటీల స్థితిగతులను భారత్ ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందని అన్నారు. బంగ్లాదేశ్‌లో శాంతి భద్రతల పరిస్థితి మెరుగుపడే వరకు భారత్ నిశిత దృష్టితో వ్యవహరిస్తుందని మంత్రి పేర్కొంటూ,

వాయిస్ (33 సెకన్లు )

-------------------------

పోలవరం ప్రాజెక్టు పనులను అత్యంత ప్రాధాన్యతగా చేపట్టి పూర్తిచేస్తామని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడు చెప్పారు. అమరావతి రాష్ట్ర సచివాలయంలో సాగు నీటి ప్రాజెక్టులపై ముఖ్యమంత్రి నిన్న సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, పోలవరం ప్రాజెక్టులో దెబ్బ తిన్న డయాఫ్రం వాల్ స్థానంలో కొత్త డయాఫ్రం వాల్ నిర్మాణాన్ని పూర్తిచేసి.. ప్రధాన డ్యాం పనులు చేపట్టాలని సూచించారు. గోదావరి-పెన్నా, వంశధార- నాగావళి నదుల అనుసంధాన ప్రక్రియను ముందుకు తీసుకెళ్లాలని అధికారులను ఆదేశించారు. తద్వారా భవిష్యత్తులో నీటి ఎద్దడిని సమర్థ వంతంగా ఎదుర్కోవచ్చున్నారు. గోదావరి డెల్టా కంటే ముందుగా కృష్ణా డెల్టాలో వ్యవసాయ పనులు మొదలయ్యేలా పూర్తిస్థాయిలో నీటిని అందుబాటులో

ఉంచాలని ముఖ్యమంత్రి తెలిపారు. ఇలా ఉండగా ఈరోజు రాష్ట్ర మంత్రివర్గం సచివాలయంలో సమావేశమై పలు అంశాలపై చర్చించనుంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో ప్రజాదర్బార్ ద్వారా ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు రాష్ట్ర ప్రభుత్వం కృషి చేస్తోందని హోం మంత్రి వి.అనిత తెలిపారు. నిన్న మంగళగిరిలోని తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యాలయంలో మంత్రి ప్రజల నుంచి వినతులను స్వీకరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ, భూమికి సంబంధించిన సమస్యలపైన ఎక్కువగా వినతులు వస్తున్నాయని చెప్పారు. వీటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కారం అందించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు. ప్రభుత్వ నిబంధనల మేరకే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డికి జెడ్ ప్లస్ కేటగిరి భద్రత కొనసాగుతోందని మంత్రి తెలిపారు.

---------------------------

తెలంగాణలో ఆగస్టు 15న 2 లక్షల వరకు రైతు రుణమాఫీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి ఏ. రేవంత్‌రెడ్డి ప్రారంభిస్తారని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు వెల్లడించారు. నిన్న హైదరాబాద్‌లోని రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన పాత్రికేయుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ,రైతు భరోసాపై అభిప్రాయ సేకరణ కొనసాగుతోందని తెలిపారు. వరంగల్ డిక్లరేషన్‌లో ప్రకటించిన విధంగా ప్రభుత్వం రుణమాఫీ చేస్తోందన్నారు. మూడు విడతల్లో ఈ ప్రక్రియ కొనసాగుతోందని పాస్‌బుక్ లేకపోయినా.. తెల్లకార్డు ద్వారా రుణమాఫీ చేస్తున్నామని చెప్పారు. రుణాలు మాఫీ కాకపోయినా రైతులు ఆందోళన చెందాల్సిన అవసరం లేదని సాంకేతిక కారణాల వల్ల 30 వేల ఖాతాల్లో డబ్బులు జమ కాలేదని వాటిని పరిష్కరించి అర్హులందరకి రుణ మాఫీ చేస్తామని తెలిపారు.

---------------------------

పాఠశాల విద్యలో అత్యుత్తమ ప్రమాణాలను పాటిస్తూ ఆంధ్రప్రదేశ్ విద్యా విధానం రూపకల్పనకు చర్యలు తీసుకోవాలని రాష్ట్ర విద్యా శాఖ మంత్రి నారా లోకేశ్ పేర్కొన్నారు. ఉండవల్లిలో నిన్న పాఠశాల విద్య ఉన్నతాధికారులతో ఆయన సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా మంత్రి లోకేశ్ మాట్లాడుతూ... పాఠ్యాంశాల్లో మాత్రమే కాకుండా క్రీడలు, సాంస్కృతిక అంశాలలోనూ విద్యార్థులను ప్రోత్సహించాలని అన్నారు. పాఠశాలల్లో విద్యాప్రమాణాల మెరుగుదలకు పాఠశాల కమిటీల భాగస్వామ్యంతో తల్లిదండ్రులు-ఉపాధ్యాయుల సమావేశాలు నిర్వహించాలని చెప్పారు. ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయాల కల్పనపై దృష్టిసారించాలని అధికారులను ఆదేశించారు.

---------------------------

భారత్ లో చేనేత రంగం దేశ సుసంపన్నమైన, వైవిధ్యమైన సాంస్కృతిక వారసత్వానికి చిహ్నంగా నిలుస్తోంది. భారత స్వాతంత్రోద్యమంలో ప్రధాన భూమిక పోషించి, స్వాతంత్ర్య సముపార్జనకు ఒక సాధనంగా నిలిచింది 'చేనేత'. గాంధీజీ సైతం రాట్నంపై నూలు వడకేందుకు అత్యంత ప్రాధాన్యతనిచ్చారు. అంతటి ప్రాధాన్యత కలిగిన చేనేత రంగానికి ప్రత్యేకంగా ఒక రోజు ఉండాలన్న ఉద్దేశ్యంతో జాతీయ చేనేత దినోత్సవాన్ని ఏర్పాటు చేశారు. 1905లో ప్రారంభమైన స్వదేశీ ఉద్యమంలో స్వదేశీ ఉత్పత్తులను ప్రోత్సహించాలనే చారిత్రాత్మక పిలుపుకి గుర్తుగా చేనేత ప్రాశస్త్యాన్ని చాటేందుకు 2015లో ఆగస్టు 7వ తేదీని మొదటి జాతీయ చేనేత దినోత్సవాన్ని ప్రధానమంత్రి నరేంద్రమోదీ ప్రారంభించారు. చేనేత కార్మికులతో సహా దేశీయ పరిశ్రమలను ప్రోత్సహించడం, చేనేత ప్రాముఖ్యత వంటి అంశాలపై ప్రజల్లో అవగాహన కల్పించేలా ఈ రోజు దేశవ్యాప్తంగా పలు కార్యక్రమాలను

నిర్వహిస్తున్నారు. కాగా  జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా  ఆకాశవాణి విశాఖపట్నం ప్రాంతీయ వార్తా విభాగం రూపొందించిన ప్రత్యేక ముఖాముఖి కార్యక్రమం ఈ రోజు ఉదయం 10 గంటలకు ప్రసారమవుతుంది.

---------------------------

జాతీయ చేనేత దినోత్సవాన్ని పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఈరోజు  బాపట్ల జిల్లా చీరాలలో పర్యటించనున్నారు. పర్యటనలో భాగంగా జిల్లాలోని స్థానిక జాండ్రపేటలో చేనేతలతో ఆయన సమావేశమవుతారు. ఈరోజు మధ్యాహ్నం ఉండవల్లి నుంచి చీరాల చేరుకుని, ఆ ప్రాంతంలో నేత కార్మికుల ఇళ్లకు వెళ్లి వారి స్థితిగతులు, జీవన ప్రమాణాలు తెలుసుకోవటంతో పాటు మగ్గాల పనితీరును పరిశీలిస్తారు.

---------------------------

పారిస్‌లో జరుగుతున్న ఒలింపిక్  క్రీడల్లో  జావెలిన్ త్రో విభాగంలో భారతీయ క్రీడాకారుడు నీరజ్ చోప్రా ఫైనల్స్‌కు చేరుకున్నారు. క్వాలిఫికేషన్ రౌండ్‌లో 89.34 మీటర్లు జావెలిన్ విసిరి తుది పోరుకు అర్హత సాధించారు. మహిళల 50 కేజీల ఫ్రీస్టైల్ రెజ్లింగ్ విభాగంలో వినేష్ పోగట్ సెమీ ఫైనల్స్‌కు చేరుకున్నారు. క్వార్టర్ ఫైనల్లో ఉక్రెయిన్ రెజ్లర్ ఒక్సానా లివాచ్ పై 7-5 తేడాతో ఆమె విజయం సాధించింది. కాగా ఈ రోజు గోల్ఫ్, టేబుల్ టెన్నిస్, అథ్లెటిక్స్ క్రీడా విభాగాల్లో భారత క్రీడాకారులు పోటీ పడతారు.

---------------------------

తెలంగాణలోని హైదరాబాద్‌లో అసెట్ మేనేజ్‌మెంట్ టెక్నాలజీ సర్వీసెస్, అడ్వాన్స్‌డ్ డేటా ఆపరేషన్స్‌లో ప్రముఖ సంస్థ ఆర్సీసీయం  ఏర్పాటుకు అంగీకరించిందని తెలంగాణ ముఖ్యమంత్రి కార్యాలయం వెల్లడించింది. అమెరికాలో పర్యటిస్తున్న  ముఖ్యమంత్రి ఏ. రేవంత్ రెడ్డి సారథ్యంలోని ప్రతినిధి బృందం పెట్టుబడులే లక్ష్యంగా పలు సంస్థలతో అవగాహన ఒప్పందాలను కుదుర్చుకుందని తెలిపింది. దీని ద్వారా వచ్చే రెండేళ్లలో హైదరాబాద్‌లో 500 మంది అత్యాధునిక సాంకేతిక నైపుణ్యం కలిగిన వారికి ఉద్యోగాలు లభించనున్నాయని పేర్కొంది.

---------------------------

ఆంధ్రప్రదేశ్‌లో   కాకినాడ నౌకాశ్రయం   కేంద్రంగా జరుగుతున్న రేషన్ బియ్యం అక్రమ రవాణాపై ప్రభుత్వం పటిష్ట చర్యలు తీసుకుంటోందని రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ తెలిపారు. నిన్న అమరావతిలో మంత్రి మాట్లాడుతూ, కాకినాడ నౌకాశ్రయంలో ఎనిమిది విభాగాల పర్యవేక్షణలో చెక్ పోస్ట్‌ను ఏర్పాటు చేశామన్నారు.  పోర్టు మార్గంలో అన్ని రవాణా వాహనాలను  తనిఖీ చేసేందుకు చర్యలు తీసుకుంటున్నామని తెలిపారు.

---------------------------

తెలంగాణలో అర్హులైన ప్రతి ఒక్కరికి ఇళ్లను ఇవ్వడమే ప్రభుత్వ లక్ష్యమని రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్ రెడ్డి అన్నారు. సూర్యాపేట జిల్లాలోని   హుజూర్ నగర్‌లో నిర్మాణంలో ఉన్న రెండు పడకల ఇళ్లను మంత్రి నిన్న పరిశీలించారు. అనంతరం  పలు అభివృద్ధి కార్యక్రమాలను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హుజూర్ నగర్‌లో 2 వేల 160 ఇళ్ల నిర్మాణ పనులను  పూర్తి చేశామని,  100 పడకల ఆస్పత్రి నిర్మాణం పరిశీలనలో ఉందని తెలిపారు.

=====================